సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



పోటెత్తిన మిర్చి

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చితో కళకళలాడింది. యార్డు నలుమూలలు మిరప బస్తాలతో నిండిపోయింది. 8లో



అర్జీలు పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 19°

వాతావరణం

జిల్లాలో మంగళవారం రాత్రి చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



గిరిజన దర్బార్‌లో సమస్యలు వింటున్న గిరిజనులు

భద్రాచలం: గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు అందచేసి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పోడు భూముల సమస్యలు, రైతుబంధు రుణాలు, పోడు భూములకు సంబంధించిన పట్టాల కోసం, వ్యవసాయానికి సంబంధించిన కరెంటు మోటారు కోసం, ట్రై కార్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు అందాయని తెలిపారు. అధికారులు డేవిడ్ రాజ్, తానాజీ , వెంకటేశ్వరరాజు, సురేష్ బాబు, మునీర్ పాషా, శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు సోమవారం విరాళం అందచేశారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి గ్రామానికి చెందిన సాయిమణికంఠ ఆగ్రో ట్రాక్టర్స్ షోరూం నిర్వాహకులు రూ. 2 లక్షలను ఆలయ అధికారులకు విరాళం అందచేయగా వారు దాతలకు రశీదును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాల్గొన్నారు.

నేడు సింగరేణి కార్మికులకు ఎరియర్స్



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తూ 1.7. 2021 నుంచి 31.5.2023 వరకు ఉద్యోగ విరమణ పొందిన సుమారు 6,300 మంది కార్మికులకు 11, వేజ్‌బోర్డ్ ఏరియర్స్‌ను యాజమాన్యం చెల్లించనుంది. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని సోమవారం వారి బ్యాంక్ అకౌంట్లలో జమచేయనుంది.

12న ప్రతిభాపాటవ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న జిల్లా స్థాయిలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల విద్యార్థులకు ఏడు అంశాల్లో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతులుంటాయని, పూర్తి వివరాలకు డీఎస్‌ఓ ఎస్.చలపతిరాజును సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి డీఏఈ జాతీయస్థాయి పోటీలు



మాట్లాడుతున్న మణుగూరు భారజల కర్మాగారం జీఎం జగ్గారావు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం , అణుశక్తి విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 38వ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో భాగంగా మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో నేటి నుంచి ఈ నెల 10 వరకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు భారజల కర్మాగారం జీఎం జగ్గారావు తెలిపారు. గౌతమీనగర్ కాలనీలోని అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం ఉదయం 9 గంటలకు గౌతమీనగర్ కాలనీలో కలెక్టర్ ప్రియాంక ఆల పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో అణుశక్తి సంస్థ విభాగంలోని ఎనిమిది జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 10న ముగింపు వేడుకలకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, అణుశక్తి కమిషన్ సభ్యులు సీమా శర్మజైన్, భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సత్యకుమార్ హాజరవుతారని వివరించారు. సమావేశంలో భారజల కర్మాగారం అధికారులు పాల్గొన్నారు.

‘డబ్లింగ్’కు రూ. 100 కోట్లు



- తాజా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు
- డోర్నకల్ – భద్రాచలం రోడ్ మార్గానికి నిధులు
- రూ.770 కోట్లతో రైల్వే ట్రాక్ రెండో లైన్ నిర్మాణానికి అంచనా
- పూర్తయితే భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రజలకు ఉపయోగం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తాజాగా ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో డోర్నకల్–భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్(రెండో లైన్) పనులకు నిధులు కేటాయించారు. దీంతో దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న పనులు త్వరలో పట్టాలెక్కనున్నాయి. రెండో లైను నిర్మాణం పూర్తయితే ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల ప్రజలకు మేలు జరగనుంది.

వందేళ్లయినా సింగిల్ లైనే..

దక్షిణ మధ్య రైల్వేలకు బొగ్గు రవాణా ద్వారా అధిక ఆదాయం వస్తోంది. బొగ్గు రవాణా కోసమే డోర్నకల్ నుంచి ఇల్లెందు (సింగరేణి కాలరీస్) వరకు 1927లోనే రైల్వేలైను నిర్మించారు. ఆ తర్వాత క్రమంగా భద్రాచలంరోడ్, మణుగూరులకు ఇటీవల సత్తుపల్లి వరకు రైలు మార్గాన్ని పొడిగించారు. అయితే వందేళ్లు కావొస్తున్నా సింగిల్‌లైన్‌గానే ఉంది. ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం, సత్తుపల్లిలో ఉత్పత్తి అయిన బొగ్గును దేశంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు డోలమైట్ రవాణాకు ఈ మార్గమే కీలకం. దేశంలో థర్మల్ విద్యుత్‌కు విపరీతమైన డిమాండ్ ఉండటంతో భద్రాచలంరోడ్ నుంచి డోర్నకల్ వరకు బొగ్గు రవాణా చేసే గూడ్సు రైళ్ల రాకపోకలు కీలకంగా మారాయి.

బొగ్గు రైళ్ల రద్దీ.. ప్రయాణికుల వెయిటింగ్

బొగ్గు, డోలమైట్ రవాణా చేసే గూడ్సు రైళ్లకు క్లియరెన్స్‌కు ప్రాముఖ్యత ఇస్తూ ప్యాసింజర్ రైళ్లను తరచుగా ఆపేస్తున్నారు. ఫలితంగా వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రైలు ప్రయాణం చేసే ప్రయాణికులు డోర్నకల్ – భద్రాచలంరోడ్ సెక్షన్‌లోకి రైలు వచ్చిన తర్వాత గమ్యస్థానం ఎప్పుడు చేరుతారనేది ప్రశ్నార్థకంగా మారింది. గంటల తరబడి రైళ్లు ఈ సెక్షన్‌లో ఆగిపోతున్నాయి. ముఖ్యంగా సింగరేణి, కాకతీయ రైళ్లకు వచ్చే వారికి ఈ తరహా కష్టాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పదేళ్లుగా డోర్నకల్ – భద్రాచలం రోడ్ – మణుగూరు సెక్షన్‌లో ఉన్న సింగిల్ లైన్‌ను డబుల్‌గా మార్చాలనే డిమాండ్లు వచ్చాయి. ఈ మేరకు పలుమార్లు సర్వేలు జరిగాయి. చివరకు డోర్నకల్ నుంచి భద్రాచలంరోడ్ వరకు ఉన్న మార్గాన్ని డబుల్ లైన్‌గా మార్చేందుకు రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

డబ్లింగ్ పూర్తయితే సాఫీగా ప్యాసింజర్ రైళ్లు

కరోనాకు ముందు భద్రాచలం రోడ్ నుంచి డోర్నకల్‌ల మధ్య ఏడు రైళ్లు నడిచేవి. ప్రస్తుతం ఐదు రైళ్లు నడుస్తున్నాయి. సత్తుపల్లి మార్గం అందుబాటులోకి వచ్చాక గూడ్స్ ట్రాఫిక్ పెరిగిపోయింది. దీంతో కొత్త రైళ్లు నడిపించడం కష్టంగా మారింది. డబ్లింగ్ పనులు పూర్తయితే కనీసం కొత్తగూడెం నుంచి డోర్నకల్‌ల మధ్య ప్రస్తుతం ఉన్న రైళ్లు ఆలస్యం కాకుండా నడిచేందుకు వీలవుతుంది. అదే విధంగా తిరుపతి, షిరిడీ, నిజామాబాద్, మంచిర్యాల, గుంటూరు తదితర పట్టణాలకు మరిన్ని రైళ్లు నడిపించేందుకు వీలవుతుంది.

చివరి దశలో భూసేకరణ

డోర్నకల్ నుంచి భద్రాచలంరోడ్ వరకు మొత్తం 54 కిలోమీటర్ల దూరం రైల్వే ట్రాక్ ఉంది. ప్రస్తుత రైల్వే అంచనాల ప్రకారం కిలోమీటరు ట్రాక్ నిర్మాణానికి రూ. 9 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు వ్యయం అవుతుంది. మార్గమధ్యంలో వంతెనల అవసరం ఎక్కువ ఉంటే నిర్మాణ వ్యయం ఇంకా పెరుగుతుంది. రైల్వేశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం డోర్నకల్ – భద్రాచలంరోడ్ రెండో లైన్ నిర్మాణానికి రూ. 770 కోట్ల వ్యయం కానుంది. ఇందులో 2024–25 బడ్జెట్‌లో రూ. 100 కోట్లను కేటాయించారు. దీంతో త్వరలో నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ట్రాక్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చివరి దశకు చేరుకుంది. డబ్లింగ్ పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న ట్రాక్‌కు సమాంతరంగా మరో ట్రాక్‌ను నిర్మిస్తారు. అంతేకాకుండా మార్గమధ్యంలో పోచారం, కారేపల్లి, గాంధీపురం, చీమలపాడు, తడికలపూడి, బేతంపూడి స్టేషన్లలో లూప్‌లైన్ల నిర్మాణం కూడా చేపడతారు.

వీగిపోయిన అవిశ్వాసం

- పాలకవర్గంలో 24 మంది సభ్యులకు 15 మంది మాత్రమే హాజరు
- సమావేశానికి ముందు చేజారిన ఇద్దరు కౌన్సిలర్లు
- కోరం లేకపోవడంతో వీగిపోయినట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి
- ఇల్లెందు మున్సిపాలిటీలో ముగిసిన అవిశ్వాస పోరు



కార్యాలయంలోకి వెళ్తున్న సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. అసమ్మతి కౌన్సిలర్ల ప్రయత్నం బెడిసి కొట్టింది. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశ సమయానికి 15 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 24 మంది సభ్యులు ఉండగా 9 మంది గైర్హాజరయ్యారు. కోరం పూర్తికావడానికి 17 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉండగా, 15 మంది మాత్రమే హాజరు కావడంతో, కోరం లేక అవిశ్వాసం అర్ధంతరంగా వీగిపోయింది. ఉదయం 11 గంటలకు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మున్సిపల్ కార్యాలయం వద్దకు రాగా, పక్కనే పెన్షనర్ భవన్‌లో తలదాచుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు బయటకు వచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లే క్రమంలో అక్కడే వేచి ఉన్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు 3వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావును మాట్లాడేది ఉందంటూ ఎదురుగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలోకి లాక్కెళ్లారు. ఎంపీడీఓ కార్యాలయం వెనుక ద్వారం నుంచి బయటకు తీసుకెళ్లి వాహనంలో తరలించారు. సీపీఐకి చెందిన 23వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి రవీందర్‌ను పెన్షనర్ భవన్ నుంచి బయటకు లాక్కుని వచ్చారు. పోలీసులు అడ్డుకోవటంతో వదిలేశారు. అప్పటికే మున్సిపల్ కార్యాలయంలో వేచి ఉన్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అతనితో మాట్లాడగా, కార్యాలయం వెనుక గోడ దూకి వెళ్లిపోయారు. కోరం లేకపోవడంతో అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కాగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మున్సిపల్ కార్యాయలం వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ఇల్లెందు, కొత్తగూడెం డీఎస్పీలు రమణమూర్తి, అబ్దుల్ రెహమాన్, సీఐలు కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోరం లేక..

మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవిశ్వాసం వీగిపోయిందని ఎన్నికల అధికారి, ఆర్డీఓ శిరీష తెలిపారు. ఎన్నిక ప్రక్రియ 11 గంటలకు ప్రారంభమైందని, పాలకవర్గ సభ్యులు 24 మందిలో 17 మంది హాజరు కావాల్సి ఉండగా, 15 మంది మాత్రమే హాజరయ్యారని పేర్కొన్నారు. రెండు దఫాలు సమావేశపర్చినా కోరం పూర్తికాకపోవడంతో అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు.

- మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో సభ్యునిగా నమోదు చేసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య అవసరమైతే ఓటింగ్‌లో పాల్గొనాలని మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. అయితే కనకయ్య అక్కడకు రాగానే సీన్ అంతా మారిపోయింది. కాగా మున్సిపల్ ఆఫీస్ వద్ద జరిగిన సంఘటనలతో తనకు సంబంధం లేదని, తాను ఓటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చానని ఎమ్మెల్యే చెప్పారు.
- పోలీస్ బందోబస్తు కోసం కోర్టును ఆశ్రయించిన కౌన్సిలర్లు రాత్రి పెన్షనర్ భవన్‌లోనే ఉన్నారు. కనీసం పోలీసులకు కూడా సమాచారం ఇవ్వలేదు. అక్కడి నుంచి ఉదయం పరుగులు తీస్తూ మున్సిపల్ ఆఫీస్‌లోకి చేరే క్రమంలో అధికార పక్షం ఒకరిని, కార్యాలయం ఆవరణలోకి చేరిన తర్వాత సీపీఐ తన సభ్యుడిని పట్టుకుంది. దీంతో ఇద్దరు సభ్యులు తగ్గిపోయారు.
- 3వ వార్డు కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరరావును అధికార పార్టీ నేతలు కిడ్నాప్ చేశారని, తమకు అప్పగించాలని ఆయన భార్య వెంకటలక్ష్మి, కుమార్తె సరిత ఆందోళన చేపట్టారు.
- పట్టపగలు పోలీసుల ముందే తమ పార్టీ సభ్యులను కిడ్నాప్ చేశారంటూ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కౌన్సిలర్లతో కలిసి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ నాగరత్నమ్మ, ఆమె భర్త జానీ, కాంగ్రెస్ జిల్లా, పట్టణ నాయకులు జానీ, డానియేల్ మీద ఫిర్యాదు చేశారు.
- క్యాంపునకు వెళ్లినా తనకు పార్టీ ముఖ్యమని, పార్టీ ఆదేశాలతోనే సమావేశానికి గైర్హాజరయ్యానని సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్ తెలిపారు.

ఎమ్మెల్యే కనకయ్యపై కేసు నమోదు

తన భర్తను కిడ్నాప్ చేశారంటూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు 17 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. మున్సిపల్ అవిశ్వాసం సందర్భంగా తన భర్త నాగేశ్వరరావును సమావేశానికి వెళ్లకుండా అడ్డుకుని కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదైన వారిలో ఎంపీపీ నాగరత్నమ్మ, ఆమె భర్త జానీ, పెద్దయ్య, కోరం సురేందర్, పింగళి నరేష్, సుధాకర్, మెరుగు కార్తీక్, శ్రావణ్, ఎస్‌కె జానీ, ఈసం లక్ష్మణ్, పూనెం సురేందర్, కృష్ణప్రసాద్, భార్గవ్, మండల రాము ఉన్నారని తెలిపారు.

పారదర్శకంగా ఎఫ్‌ఎల్‌సీ

కలెక్టర్ ప్రియాంక ఆల



ఈవీఎం గోదాం, వీవీ ప్యాట్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఎఫ్‌ఎల్‌సీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం, లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర కళాశాలలోని ఈవీఎం, వీవీప్యాట్‌ల గోదాంలను సోమవారం పరిశీలించి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 15వ తేదీవరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీడియోగ్రఫీ, సీసీ కెమెరాల మధ్య ఎఫ్‌ఎల్‌సీ(ఫస్ట్ లెవెల్ చెక్) ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు 1,588 బ్యాలెట్ యూనిట్లు, 1,424 కంట్రోల్ యూనిట్లు, 1,683 వీవీ ప్యాట్ యంత్రాలు కేటాయించిందని తెలిపారు. ఎఫ్ఎల్సీ ముగిసిన తర్వాత మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. లోపాలుంటే ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంలను వాపసు చేస్తామని తెలిపారు. తొలుత వీవీప్యాట్, ఈవీఎం గోదాములో ఈవీఎంలను, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎన్నికల విభాగం తహశీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం తహశీల్దార్ పుల్లయ్య, నాయబ్ తహశీల్దార్ రంగప్రసాద్, ఈసిఐఎల్ ఇంజనీర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సిబ్బంది నవీన్, అశోక్ పాల్గొన్నారు.

గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వీరూనాయక్



వీరూ నాయక్‌కు నియామక పత్రం అందజేస్తున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం టౌన్: భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వీరూ నాయక్ నియమితులయ్యారు. సోమవారం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ నియామక పత్రం అందించారు. ఈయన గతంలో ఇదే కళాశాలలో 8 ఏళ్ల అధ్యాపకునిగా పని చేశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం వీరూనాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభివృద్ధికి, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని చెప్పారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటాలి

వ్యవసాయ విశ్వవిద్యాలయ డీఎస్‌ఏ డాక్టర్ సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఎస్‌ఏ డాక్టర్ సత్యనారాయణ



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అశ్వారావుపేటరూరల్: ఉన్నత విద్యతోపాటు క్రీడా పోటీల్లో కూడా విద్యార్థులు సత్తా చాటాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం డీఎస్‌ఏ(డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్) డాక్టర్ సత్యనారాయణ సూచించారు. సోమవారం వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అశ్వారావుపేట, హైదరాబాద్, రాజేంద్రనగర్, తోర్నాల, రుద్రూర్, సిరిసిల్ల, జగిత్యాల, పాలెం, వరంగల్, ఆదిలాబాద్, సంగారెడ్డిలోగల వ్యవసాయ కళాశాలలకు సంబధించిన అంతర కళాశాల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శరీర దృఢత్వానికి దోహదపడుతాయని అన్నారు. పోటీల్లో 430 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, ఆదిలాబాద్ జిల్లా ఎస్సై జగదీష్, పరిశీలకులు డాక్టర్ జే సురేష్, కళాశాల ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు డిపెండెంట్లకు నియామక పత్రాలు



సింగరేణి జీఎం కట్టా బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 2023 అక్టోబర్ నుంచి 2024 జనవరి వరకు నాలుగు నెలల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన 412 మంది డిపెండెంట్లకు ఈ నెల 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. 412 మందిలో జిల్లాలోని కొత్తగూడెం ఏరియాలో 29, కార్పొరేట్ ఏరియాలో 11, మణుగూరులో 14, ఇల్లెందులో 10 మంది ఉన్నారని తెలిపారు. వీరు హైదరాబాద్ వెళ్లేందుకు ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 1,600, మహిళా అభ్యర్థులకు, అటెండెంట్లతో కలిపి రూ.3,200 చెల్లిస్తామని పేర్కొన్నారు. ట్రావెలింగ్ బిల్స్ సబ్‌మిట్ చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 17 మందికి జూనియర్ అసిస్టెంట్ నియామక పత్రాలు, 2023 నోటిఫికేషన్‌కు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న మోటార్ మెకానిక్ విభాగంలో ఐదుగురు అభ్యర్థులకు కూడా నియామక పత్రాలు ఇస్తామని వివరించారు.

విధుల్లో చేరిన 140 మంది జూనియర్ అసిస్టెంట్లు

సింగరేణిలో 140 మంది జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో చేరారని జీఎం తెలిపారు. ఇటీవల ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా నియమితులైన 146 మంది జూనియర్ అసిస్టెంట్ విధుల్లో చేరాక, ఎన్నికల కోడ్ కారణంగా నియామక ప్రక్రియ నిలిచిపోయింది. అభ్యర్థుల విన్నపం మేరకు సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేయగా 140 మంది విధుల్లో చేరారు.

19 నెలలకు గుర్తుకొచ్చింది!

ఈ నెలలో ఐటీడీఏ పాలకమండలి భేటీ

- 10వ తేదీలోపు నిర్వహించాలని భావిస్తున్న అధికారవర్గాలు
- మూడు నెలలకోసారి జరపాల్సి ఉన్నా సమావేశాలకు తీవ్ర జాప్యం
- గిరిజన సంక్షేమంపై దృష్టిపెట్టకుండా మొక్కుబడిగా సాగుతున్న వైనం



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రణాళికల రూపకల్పన, అమలుపై సమీక్ష నిర్వహించాల్సిన ఐటీడీఏ పాలక మండలి సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమావేశాలను ఏడాదికోసారి కూడా జరపడంలేదు. ఎప్పుడోసారి నిర్వహించినా అవి కూడా ప్రభుత్వ డప్పులుగా సాగుతున్నాయే తప్ప పెద్దగా ప్రయోజనం కలిగించడం లేదని గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడోసారి సమావేశం...

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో చిట్ట చివరి సమావేశం 2022, జూలై 8న నిర్వహించారు. ఇప్పటికీ 19 నెలలు గడిచింది. తాజాగా ఈ నెలలో సమావేశం నిర్వహించేందుకు ఐటీడీఏ అధికారవర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. చివరి సమావేశానికి 35 నెలల ముందు 2019, ఆగస్టు 13న సమావేశం నిర్వహించారు. ఇలా సమయ ప్రణాళిక లేకుండా పాలకవర్గాల సమావేశాలు సాగుతున్నాయి. ఈ నెలలో సమావేశానికి రంగం సిద్ధం చేసిన అధికారులు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. అందరి సమయం అనుకూలిస్తే ఈ నెల 10న నిర్వహించాలని భావిస్తున్నారు. ఒకవేళ అందరి సమయం దొరకకపోయినా, ఆలస్యమైనా... ఈలోపు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో మళ్లీ కొద్ది రోజులు వాయిదా పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కోడ్ రాక ముందే సమావేశం నిర్వహించాలని ఐటీడీఏ అధికారులు భావిస్తున్నారు.

ప్రగతి నివేదికలకే పరిమితం

సమావేశాల్లో గిరిజనుల అభివృద్ధికి అమలవుతున్న పథకాలపై చర్చించి, లోపాలు ఉంటే అధిగమించేలా, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎప్పుడోసారి నిర్వహించే సమావేశాలు అధికారుల, మంత్రుల ప్రభుత్వ ప్రగతి నివేదికల సమర్పణకే పరిమితమవుతున్నాయని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. చివరి సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు. నాడు గిరిజన మంత్రిగా పాల్గొన్న సత్యవతి రాథోడ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో గిరిజన విద్యార్థులు, నిరుద్యోగుల కోసం స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇది అమలుకు నోచుకోలేదు. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు లక్ష ఎకరాలకు పోడు హక్కు పత్రాలు ఇస్తానని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. కానీ హక్కు పత్రాలు కొందరికే అందాయి. అప్పటి భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చర్ల మండల కేంద్రంలో డిగ్రీ, వెంకటాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలని, జీఓ నంబర్ 3ను పునరుద్ధరించేందుకు తీర్మానం చేయాలని కోరగా, ఇప్పటివకు కనీసం కదలికలేదు.

పీఓ ప్రతీక్‌జైన్‌కు తొలి సమావేశం

భద్రాచలం ఐటీడీఏ పీఓ బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్‌కు ఇది తొలి సమావేశం. ఆయన బాధ్యతలు స్వీకరించాక విద్య, వైద్య శాఖల తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. గిరిజనులకు ఇప్పపువ్వు ఆదాయ వనరుగా మార్చేందుకు ‘ఇంటింటికి ఇప్పపువ్వు’ కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తున్నారు. నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించేలా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నారు. అయితే సంక్షేమ పథకాలను గిరిజనుల దరి చేర్చటంలో ఐటీడీఏ కొంత వెనుకబాటుకు గురవుతోంది. దీనిపై పీఓ ఇప్పటివరకు తన మార్క్ చూపించలేకపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి తగిన నిధులను రప్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

కేబినెట్‌లో కీలకంగా ఉమ్మడి జిల్లా మంత్రులు

ఉమ్మడి జిల్లాకు చెందిన భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రిగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర కేబినెట్‌లో కీలకమైన శాఖల మంత్రులుగా బాధ్యతలను నిర్వరిస్తున్నారు. వీరు ఈసారి సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉండగా, తమ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపుతారని, సంక్షేమానికి అధిక నిధులు కేటాయిస్తారని గిరిజనులు ఆశిస్తున్నారు. ఆ దిశగా పీఓ ప్రతీక్‌జైన్ కూడా కృషి చేయాలని కోరుతున్నారు. కాగా చిత్తశుద్ధితో సమావేశాలను నిర్వహించి గిరిజనాభివృద్ధి ప్రణాళికలపై బహిరంగంగా చర్చ జరపాలని, అభిప్రాయ సేకరణ చేపట్టాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల హామీలు నెరవేర్చాలి



డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

చుంచుపల్లి/భద్రాచలంటౌన్: ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు డిమాండ్ చేశారు. 'సోమవారం ఆయన కొత్తగూడెం, భద్రాచలం ఆర్టీసీ డిపోల్లో కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2'కార్మికులను కలుసుకుందాం... సమస్యలను తెలుసుకుందాం' అనే కార్యక్రమంలో భాగంగా డిపోలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం కార్మికులపై పని భారం పెంచుతోందని ఆరోపించారు. డ్రైవర్లు, కండక్టర్లు రోజుకు 14 గంటలకు పైగా డ్యూటీలు చేస్తున్నారని, గ్యారేజీల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని అన్నారు. అనంతరం డిపో మేనేజర్ వెంకటేశ్వరావును కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లింగమూర్తి, బాణాల రాంబాబు, శామ్యూల్, జాకబ్, వైఎస్.రావు, నూర్జాన్, రాజ్యలక్ష్మి, జానీమియా రాములు, శివరామకృష్ణ, సుధాకర్, నారాయణ, ముత్తయ్య, ప్రతాప్, ప్రసాద్, వీవీ రావు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు మహానంది అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు దంపతులు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు జాతీయ స్థాయి మహానంది అవార్డు అందుకున్నారు. ఆదివారం వరంగల్ టీఎన్జీవో భవనంలో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ -విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు వెంకటేశ్వరావు సోమవారం తెలిపారు.

హాకీ, బాస్కెట్ బాల్ విజేత కేటీపీఎస్ జట్టు



గెలిచిన జట్టుకు ట్రోఫీ అందిస్తున్న సీఈలు ప్రభాకర్ రావు, శ్రీనివాసబాబు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ హాకీ, బాస్కెట్ బాల్ క్రీడా పోటీల్లో కేటీపీఎస్ 5,6 దశల జట్లు చాంపియన్‌గా నిలిచాయి. మూడు రోజులుగా కేటీపీఎస్ 5,6 దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న హాకీ, బాస్కెట్ బాల్ క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. రెండింటిలోనూ కేటీపీఎస్ 5,6 దశల జట్టు విజేతగా నిలిచింది. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. 5,6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు, జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాస బాబు, అధికారులు రామారావు, లోహిత్ ఆనంద్, వీరస్వామి, వైటీఎంకె.రాజు, కట్టా శ్రీధర్, రిఫరీలు ఇలియాజ్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత సోమవారం తీర్పు చెప్పారు. చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న భూక్య హేప్లి ఇంట్లో గతేడాది ఏప్రిల్ 17న రాత్రి చోరీ జరిగింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కారేపల్లి మండలం మాధారానికి చెందిన పూనెం రాజు అనే వ్యక్తి చోరీ చేసినట్లు దర్యాప్తులో తేలగా, పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఆరుగురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఐకేపీ సీసీ ఇంట్లో చోరీ

బంగారు చైన్, నగదు అపహరణ

అన్నపురెడ్డిపల్లి : మండలంలోని పెంట్లం పంచాయతీ పరిధిలోని గంగాధరపురం గ్రామంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐకేపీలో సీసీగా పనిచేస్తున్న రాయల జ్యోతి గంగాధరపురంలో నివసిస్తూ అన్నపురెడ్డిపల్లి సీసీగా విధులు నిర్వహిస్తోంది. విధులు ముగించుకుని సోమవారం సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని వస్తువులు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా పగలగొట్టి మూడు తులాల బంగారు చైన్, రూ.5వేలు అపహరించారని గుర్తించింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై షాహీనా పరిశీలించి, కొత్తగూడెం క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్‌టీం సభ్యులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోటెత్తిన మిర్చి



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

- పంట కోత పెరగడంతో పుంజుకున్న విక్రయాలు
- మిర్చి బస్తాలతో మార్కెట్ కళకళ
- పలు జిల్లాలు, ఏపీ నుంచి విక్రయానికి తీసుకొచ్చిన రైతులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చి బస్తాలతో కళకళలాడింది. మార్కెట్ యార్డు నలుమూలలు మిరప బస్తాలతో నిండిపోయాయి. సోమవారం ఖమ్మం మార్కెట్‌కు దాదాపు 50 వేల మిర్చి బస్తాలు విక్రయానికి వచ్చాయి. శని, ఆదివారాలు సెలవులు కావడంతో సోమవారం విక్రయాలు పుంజుకున్నాయి. పంట కోతలు పెరగడంతో విక్రయాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఎర్ర మిర్చి 41,185 బస్తాలు, తాలు మిర్చి 5,230 బస్తాలు విక్రయానికి వచ్చినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికమని మార్కెట్ కమిటీ లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన మిర్చి పంట డిసెంబర్ రెండో వారం నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొదటి కోత పంట జనవరి నెల వరకు సాగింది. తొలికోత పంట మైల కాయ కావడంతో రైతులు ఆ పంటను ఎప్పటికప్పుడే విక్రయించారు. మొదటి కోత పంట అరకొరగా రావడంతో పాటు అంత నాణ్యత ఉండకపోవడంతో రైతులు నిల్వ పెట్టేందుకు ఆసక్తి చూపరు. ఇలా జనవరి నెల వరకు రైతులు మొదటి కోత పంటను విక్రయించారు. ప్రస్తుతం రెండో కోతలు ప్రారంభమయ్యాయి. ఈ పంట కొంత నాణ్యంగా ఉంటుంది. రెండో కోత పంట దిగుబడి కూడా కొంత మెరుగ్గానే ఉంటుంది. రెండో కోతలు కొనసాగుతున్న క్రమంలో విక్రయాలు కూడా పెరుగుతున్నాయి. జనవరి ఆరంభంలో రోజుకు 15 వేల బస్తాల చొప్పున మిర్చి విక్రయానికి రాగా, రెండో వారానికి 25 వేల బస్తాలకు పెరిగింది. మూడో వారానికి 30 వేల బస్తాలు, చివరి వారానికి 35 వేల బస్తాలు దాటాయి. ఇక ఫిబ్రవరి ఆరంభం నుంచి ఆ సంఖ్య 40 వేల బస్తాలకు చేరింది. నాలుగైదు రోజుల వ్యవధిలో 50 వేల బస్తాలు విక్రయానికి రావడం విశేషం.

రూ.21,600 పలికిన ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మిర్చి జెండా పాట ధర రూ.21,600గా పలికింది. మోడల్ ధర రూ.19,500గా నమోదైంది. ఇక కనిష్ట ధర రూ.14,000 ఉంది. జనవరి మూడు, నాలుగు వారాల్లో రూ.21,000 నుంచి రూ.21,300 వరకు గరిష్ట ధర పలకగా, ప్రస్తుతం రూ.21,600 ఉంది. నాణ్యమైన పంట విక్రయాలు పెరగడంతో ధర కొంత మేర పుంజుకుంది. మొత్తంగా పంట నాణ్యత ఆధారంగా మోడల్ ధరల్లో పంట కొనుగోళ్లు జరిగాయి. ఇక తాలు మిర్చికి కూడా డిమాండ్ పెరిగింది. ఈ రకం గరిష్ట ధర రూ.12,000, మోడల్ ధర రూ.11,000గా నమోదైంది. కనిష్ట ధర రూ.8,000 పలికింది. రైతులు ఎప్పటికప్పుడు ధరలను పరిశీలిస్తూ మిర్చి విక్రయాలకు తీసుకొస్తున్నారు.

పొరుగు జిల్లాలతో పాటు ఏపీ నుంచి..

తేజా మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్ పెట్టింది పేరు. తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు, వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లు మిర్చి కొనుగోళ్లలో పేరుగాంచాయి. అయితే తేజా మిర్చికి మాత్రం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకం. దీంతో ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, మహబూబ్‌నగర్‌తో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి రైతులు మిర్చిని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తేజా మిర్చి విదేశీ రకం కావడంతో ఎగుమతిదారులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను కేంద్రీకరించి కొనుగోళ్లు చేస్తుంటారు. విదేశీ ఆర్డర్లు ఉంటే వ్యాపారులు పంటను పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్ విక్రయాలు అధికంగా సాగుతున్నాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం అగ్రహారం కొత్తూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోతురాజు సాయిరాం ఆదృశ్యమైనట్లు ఆయన తండ్రి నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడేనికి చెందిన సాయిరాం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 4న హైదరాబాద్ నుంచి కొత్తూరులో ఉన్న పెద్దమ్మ నాగమణి ఇంటికి వచ్చా డు. సోమవారం ఉదయం ఇంట్లో నుంచి ఆదృశ్యమయ్యాడని, ఫోన్ స్విచాఫ్ వస్తోందని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బొగ్గు గనులు సాధిద్దాం

కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్



మాట్లాడుతున్న బలరాం నాయక్

ఇల్లెందు: ఇల్లెందులో బొగ్గు గనులు సాధించాల్సి ఉందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. సోమవారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీ టికెట్ తనకు వస్తుందనే విశ్వాసం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు వచ్చే ఎన్నికల్లో 17 పార్లమెంట్ సీట్లు గెలిచేలా చేస్తాయన్నారు. ఇల్లెందు - గుండాల రోడ్ తన హయాంలో ఏర్పాటు చేశామని, గుండాల - పస్రా రోడ్‌ను పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దొడ్డా డానియేల్, సుదర్శన్‌కోరీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు చిన్నారి



అక్షయను తల్లికి అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

మధిర: విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో తప్పిపోయిన చిన్నారి రైల్వే పోలీసులు, సిబ్బంది సహకారంతో ఎట్టకేలకు తల్లి చెంతకు చేరింది. మధిరలో ఈనెల 6 నుంచి కల్వరి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో స్వచ్ఛందంగా పనిచేసేందుకు తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన కొమెర బోయిన రమేష్, వనజ దంపతులు వారి కుమార్తె అక్షయ(5)ను తీసుకుని ఆదివారం రాత్రి ఖమ్మం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ లింక్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మధిర రైల్వేస్టేషన్‌లో దిగేముందు లగేజీ మాత్రమే దింపి చిన్నారిని కిందకి దింపడం మర్చిపోయారు. రైలు కదిలిన తర్వాత చిన్నారిని చూస్తే కనిపించలేదు. రైల్వే పాయింట్స్ మెన్ కృష్ణ సహాయంతో స్టేషన్ మాస్టర్ సల్మాన్ అబ్బాస్‌కు ఈ విషయం చెప్పారు. దీంతో ఆయన రైల్వే పోలీస్ మాతంగి వెంకటేశ్వర్లుకు చెప్పి పాప ఫొటోని పంపించారు. తర్వాత వచ్చే రాయనపాడు స్టేషన్ మాస్టర్‌కు అక్షయ గురించి చెప్పారు. కాగా, రైలులో తప్పిపోయి రోదిస్తున్న చిన్నారిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది రాయనపాడు స్టేషన్ మాస్టర్‌కు అప్పగించారు. ఆ తర్వాత చిన్నారిని మధిర రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చి రైల్వే పోలీసులు, సిబ్బంది సహకారంతో తల్లిదండ్రులకు అప్పగించారు. సుమారు రెండు గంటలపాటు వారి కుమార్తె కోసం తల్లిదండ్రులు రైల్వే స్టేషన్‌లో తీవ్రంగా రోదించారు. ఎట్టకేలకు రైల్వే పోలీసులు, సిబ్బంది సకాలంలో స్పందించి చిన్నారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వేటాడకపోతే 100 టన్నులు చేప గోవిందా!

- 2-3 అడుగులకు చేరిన నీటిమట్టం
- మూడేళ్లుగా కొనసాగని చేపల వేట
- మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు చెరువును పరిశీలించిన ఏడీ



అడుగంటిన చెరువును పరిశీలిస్తున్న ఏడీ ఆంజనేయస్వామి

నేలకొండపల్లి: జిల్లాలోనే పెద్ద చెరువుల్లో చెరువు మాధారం చెరువు ఒకటి. ప్రస్తుతం ఆ చెరువు 2-3 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. దీంతో చేపల వేట చేయకుంటే దాదాపు 100 టన్నుల చేప చనిపోయే ప్రమాదం ఉందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చెరువుపై మంగాపురంతండా, రాయగూడెం, రాజారాంపేట, చెరువుమాధారం గ్రామాలకు చెందిన దాదాపు 832 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. గత మూడేళ్లఆ వివిధ కారణాలతో మత్స్యకారులు చేపల వేట సాగించలేదు. ఈ ఏడాది చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చేపల వేట సాగించేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ అనుమతి కోసం రూ.4 లక్షల ఫీజు కూడా ప్రభుత్వానికి చెల్లించారు. ఈనేపథ్యాన చెరువుమాదారం చెరువులో చేపల వేటను సాగించేందుకు అనుమతి ఇవ్వాలని మత్స్య శాఖ ఏడీ డి.ఆంజనేయస్వామిని ఆశ్రయించారు.

చెరువును పరిశీలించిన ఏడీ..

చెరువులో నీటి మట్టం పరిస్థితిని తెలుసుకునేందుకు సోమవారం ఏడీ ఆంజనేయస్వామి నాటు పడవలో సొసైటీ పాలకవర్గం ప్రతినిధులతో కలిసి నీటి కొలతలు తీసుకున్నారు. పలుచోట్ల 2 అడుగులు, మరికొన్ని చోట్ల మూడు అడుగులు నీటి సామర్థ్యం ఉన్నట్లు ఏడీ తెలిపారు. ఈ సందర్భంగా చేపల వేట సాగించకుంటే తామంతా తీవ్రంగా నష్టపోతామని మత్స్యశాఖ అధికారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, చెరువుమాధారం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఈవూరి శ్రీనివాసరెడ్డి, తేజావత్ బాలు తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు..

- పాతర్లపాడులో రెండు చోట్ల దొంగతనాలు
- నగదు, బంగారు ఆభరణాల అపహరణ



ఇటీవల తెట్టెలపాడులో మిర్చిని ఎత్తుకెళ్లడంతో సగం ఖాళీ అయిన కుప్ప (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలో దొంగలు రెచ్చిపోతున్నారు. నిన్నామొన్నటి వరకు మిర్చి కల్లాలు, పెట్రోల్ బంకుల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తున్నారు. దీంతో ప్రజలు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని పాతర్లపాడులో ఆదివారం అర్ధరాత్రి షేక్ యాకూబ్‌బీ అనే మహిళ కిరాయి ఇంట్లో ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని అత్తగారింటికి వెళ్లింది. సోమవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.15వేలతో పాటు రూ.28 వేల విలువైన ఆరు గ్రాముల వెండి పట్టీలు, 3గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో శంకర్ అనే వ్యక్తి డబ్బాకొట్టు తాళాలు పగుల గొట్టి అందులోని నగదు, మద్యం సీసాలు, పెట్రోల్ ఎత్తుకెళ్లారు. పాతర్లపాడు స్టేజీ వద్ద గల ఓ మెడికల్ షాపు షట్టర్ తొలగించారు. మండలంలోని తెట్టెలపాడులో ఇటీవల పుసులూరి సురేష్ అనే రైతు కల్లంలో మిర్చి రాసి పోసి ఉంచగా ఆటోలో వచ్చిన దుండగులు సుమారు 10 క్వింటాళ్ల మిర్చిని ఎత్తుకెళ్లారు. పిండిప్రోలులో కూడా రాష్ట్రీయ రహదారి వెంట మిర్చి కల్లాల్లోని మిర్చిని దొంగిలించేందుకు ప్రయత్నించగా రైతులు అప్రమత్తం కావడంతో పరారయ్యారు. ఆదివారం రాత్రి కూడా మిర్చిని ఎత్తుకెళ్లేందుకు రాగా రైతులు కేకలు వేయడంతో పరారయ్యారు. పాపాయిగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో ప్రారంభం కాని పెట్రోల్ బంక్‌లో కూడా భారీగా డీజిల్ ఎత్తుకెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జేసీబీ, రెండు టిప్పర్లు సీజ్



సీజ్ చేసిన టిప్పర్లు

జూలూరుపాడు: అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, రెండు టిప్పర్లను ఆదివారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ఆర్.శారద వివరాలు వెల్లడించారు. పడమటనర్సాపురం రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 162 ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తుండగా ఏఎస్సై తిరుపతిరావు, వీఆర్‌ఏ బహర్‌అలీలు అడ్డుకుని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు టిప్పర్లకు రూ.50 వేలు, జేసీబీకి రూ. 50 వేల చొప్పున మొత్తం రూ.లక్ష జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.


నలుగురిపై కేసు నమోదు

దమ్మపేట: పుట్టినరోజు వేడుకల పేరుతో ఇబ్బందికరంగా ప్రవర్తించిన యువకులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... దమ్మపేట గ్రామంలోని బంజారా కాలనీకి చెందిన ముగ్గురు యువకులు తమ మిత్రుడి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి సమయంలో వీధిలోని ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించారు. అసభ్యకర ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. ఈ ఘటనలో నలుగురు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పాల్వంచరూరల్: కోడి పందేల స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్‌ఐ బి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని బంధ్రుగొండ గ్రామశివారులో సోమవారం కోడిపందేలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఆరుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేయగా, మరికొందరు పారిపోయారు. రూ.11,800 నగదు, కోడి పుంజు, 5 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి



విజయ్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కూడలి సమీపంలో ఉన్న హోండా షోరూంలో విజయ్ (19) అనే కార్మికుడు సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. కారేపల్లి మండలం మాధారం గ్రామ సమీపంలోని కొత్తతండాకు చెందిన విజయ్ వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇల్లెందు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

భద్రాచలంటౌన్: పట్టణంలోని కొత్త కూరగాయ మార్కెట్ సెంటర్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎటపాక మండలం నల్లకుంట్ల గ్రామానికి చెందిన తెల్లం భద్రయ్య ద్విచక్ర వాహనంపై వస్తుండగా, గల్లీలో నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో భద్రయ్యకు తీవ్ర గాయాలుకాగా స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఇదే ప్రమాదంలో ద్విచక్ర వాహనం తగిలి భగవాన్‌దాస్ కాలనీకి చెందిన తిరుతమ్మ అనే మహిళ కూడా తీవ్రంగా గాయపడింది. ఎస్‌ఐ మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బూర్గంపాడు: గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ప్రజావాణి అర్జీలు పరిష్కరించాలి



అధికారులు సమయానికి హాజరుకాకపోవడంతో వెలవెలబోతున్న ప్రజావాణి హాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల వివరాలు..

- పాల్వంచలోని రిలయన్స్ పెట్రోల్ బంకు వెనుక భాగంలో సర్వే నంబర్లు 19, 20, 22, 23, 74లలోని ప్రభుత్వ భూమి, నక్కలవాగుకు చెందిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు చేసి అమ్ముతున్నారని పాల్వంచలోని గోవర్ధనగిరి కాలనీకి చెందిన యల్లావుల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- పర్యావరణ సమతుల్యాన్ని దెబ్బతీస్తున్న అటవీ అభివృద్ధి సంస్థను రద్దు చేయాలని, అటవీ అభివృద్ధి పేరుతో వ్యాపారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో అటవీ అభివృద్ధి సంస్థ సాగుచేస్తున్న 62 వేల ఎకరాలు, అందులోని జిల్లాలోని 22,180 ఎకరాల భూమిని ఆదివాసీ సొసైటీలకు ఇవ్వాలని సామాజిక కార్యకర్త, ఆదివాసీ నాయకులు సోయం బాబూరావు ఫిర్యాదు చేశారు.
- మెడికల్ కళాశాలలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగానికి దరఖాస్తు చేశానని, ఇప్పటివరకు పరీక్ష నిర్వహించ లేదని ఇల్లెందుకు చెందిన రాంకీ అనే యువకుడు దరఖాస్తు చేయగా.. మెరిట్ లిస్ట్ ప్రకారం ఉద్యోగ నియామకాలు జరిగాయని కలెక్టరేట్ ఏఓ గన్యా తెలిపారని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రజావాణి కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని ప్రకటించినా వివిధ శాఖల అధికారులు సమయానికి హాజరు కాలేదు. దీంతో 10.30 గంటల తర్వాతే కార్యక్రమం ప్రారంభమైంది. అధికారులు సమయానికి రాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్ ఒక్కరే దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమం ముగిసేముందు అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు వచ్చారు. ప్రజావాణికి జిల్లా అధికారులే హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించినా చాలా శాఖల అధికారులు తమ సబార్డినేట్లనే పంపిస్తున్నారు. కలెక్టర్ హాజరైతేనే కొందరు జిల్లా అధికారులు ప్రజావాణికి వస్తున్నారు. లేకపోతే సబార్డినేట్లనే పంపిస్తున్నారు. మరికొన్ని శాఖల అధికారులు అసలు హాజరు కావడం లేదు.

షార్ట్ సర్క్యూట్

ప్రజావాణి ప్రారంభంలోనే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించే ఎల్‌ఈడీ టీవీ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. పొగలు వచ్చి స్క్రీన్ కాలిపోయింది. వెంటనే సంబంధిత సిబ్బంది అక్కడి నుంచి దానిని తరలించారు.



షార్ట్ సర్క్యూట్ జరిగిన తర్వాత టీవీని తరలిస్తున్న సిబ్బంది

● రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌కు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌కు సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు పలువురు ఎంపికయ్యారు. మండల, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌కు ఎంపికయ్యారని బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించారు.

– బూర్గంపాడు